రక్తస్పర్శ

జీవితమంటే మజాకా గాదు. అది ఒక అగ్నిగుండం. ఒక వ్యక్తి జీవితాన్ని అన్ని విధాలా బాగుచేసినా, అమాంతం నాశనం చేసినా, సంఘం తను చేసినపనికి తనే సంతోషిస్తుంది. అదే దాని నైజం. తనకు ఎదురుతిరిగిన వాళ్ళని అది నీచంగా చిత్రించి బాధపెట్టి, స్మశానంలో వాళ్ళ శవం తాలూకా పొగ కన్పించేవారకూ సంతృప్తి పడకపోయినా, శృతిమించినట్లైతే వాళ్ళనే తప్పక పొగిడి తీరుతుంది. ఇదే దాని రూపం. సంఘానికి ఆత్మవుందో, లేదో అనేది అనిర్ణీతమైన విషయం.. ఆత్మలంటూ వున్న వ్యక్తులు కలిసిందే సంఘం కనుక, దానికి లక్ష ఆత్మలూ, కోటి ఉద్దేశాలూ వుంటాయనేది కేవలం వాదనకి పనికివచ్చే విషయం మాత్రమే. ఒకణ్ణి సర్వనాశనంచేసే విషయంలోనూ, ఇంకొకడు తను విధించిన నీతుల్ని బహిరంగంగా ఆమోదిస్తూ, రహస్యంగా వాటినన్నిటినీ వ్యతిరేకిస్తున్నా - వాణ్ణి, వాడి రహస్యనేరాల్నీ క్షమించే విషయంలోనూ, సంఘం తన లక్షఆత్మల్నీ, కోటి ఉద్దేశాల్నీ వికృతంగా ప్రదర్శిస్తూనే వున్నది. ఒక చండశాసనుణ్ణే అది తల వొగ్గి భరిస్తున్నది. పదిమందిని ఏదోరకంగా గొప్ప పేర్లతో మోసం చేస్తున్న పెద్దమనిషిని సహిస్తున్నది. తెల్లగా బట్ట లేసుకుని తిరిగే లక్షమంది లోపాయికారీ దుర్మార్గుల్ని అది మాట అనలేక పోతున్నది. తన శ్రమకు తగిన ప్రతిఫలం ఎట్లాగు పొందలేని కూలివాణ్ణే అది కనికరిస్తున్నది. కాని వాడే దేనికోసమన్నాగాని సమ్మె అంటూ చేస్తే దాన్ని చచ్చేట్లు వ్యతిరేకిస్తున్నది. జేబులు కొట్టే వాణ్ణి దొంగ అని కోర్టులో శిక్షిస్తున్నది. వ్యాపారంలో లక్షలార్జించేవాణ్ణి అదృష్టవంతుడని పొగడుచున్నది. ఒకణ్ణే చంపితే నేరమని ఉరిశిక్ష విధిస్తున్నది. పదిమందిని చంపితే పరాక్రమమంటున్నది. ఇదీ మధ్యతరగతి లక్షణం!

2

స్మశానంలో దక్షిణవైపు మూలగా శవంనుంచి పొగలేస్తున్నది. కొత్త పేట మూడోలైను చివరి పెంకుటింటికి చెందిన కరణంగారికి అంత్యక్రియలు జరుగుతున్నై. ఆయనకి ఒక్క కొడుకు ప్రసాదరావు. వాడికున్న పెద్దది అనసూయ. ఇద్దరే, చుట్టాలంటూ భూమిమీద మిగిలినవాళ్ళు. భార్య పోవడం, కరణంగారు మళ్ళీ పెళ్ళికి ఇష్టపడకపోవడం, అందువల్ల కొన్ని ఇబ్బందులు కలిగినా, వాటిని లెక్కచెయ్యకుండా వంటమనిషిని పెట్టుకుని కాలం గడపటం; ఇవన్నీ కరణంగారి వంటరి బుద్ధిని వ్యక్తీకరిస్తాయి. అయినప్పటికీ ఆయన బతికున్నంత కాలమూ పలుకుబడితో కాలం వెళ్ళబుచ్చాడు. కరణీకం వదులుకున్నప్పటికీ ఆయనకి కరణంగారనే పేరు స్థిరపడిపోయింది.

నోటి మంచితనాన ఎంతపనైనా సాధించవచ్చునని ఆయన చెబుతుండేవాడు. తీరా ఆయన మరణించేటప్పటికి దూరపు బంధువులైనా ఎక్కడున్నా ఉన్నారేమో అన్న భోగట్టాకూడా చుట్టుపక్కలవాళ్ళకి అంతుచిక్కలేదు. చిట్టచివరికి ఇరుగుపొరుగన వున్న సాంబయ్యగారూ, అవధానులుగారూ నిలబడి నలుగుర్ని పోగుచేసి కరణంగారి అంత్యక్రియలు జరిపించారు. ప్రసాదరావుకి పన్నెండేళ్ళూ, అనసూయకి పదిహేనేళ్ళూ ఉంటాయి తండ్రిపోయేటప్పటికి. ఇద్దరూ తండ్రి కోసం దిగులుపడ్డారు. అయితే ఎంత చిన్నదైనా ఆడది గనుక అనసూయ తమ్ముణ్ణి ఓదార్చింది. ఆమెలోనూ దుఃఖం లేక పోలేదు. స్మశానంనుంచి ఇంటికి వచ్చింతర్వాత అనసూయ అవధానిగారి భార్యచేతనే అన్నం ఉడకేయించి, తమ్ముడికి పెట్టి, తనూ ఇంత తిన్నది. తమ్ముడికి జ్ఞానోదయం కానందు వల్ల ఎక్కడ దిగులు పడిపోతాడో అని దుఃఖాన్ని లోలోపల దిగమింగి 'నాయనా ఏం చేస్తాం! ఏడవకు, మనం నోచుకున్నదంతే!' అని ఓదార్చింది. కర్మవగైరా చేయడానికి గానుతండ్రి పెట్టెతాళాలు తీసి పైకంకోసం వెతికింది. ఒక కవరులో యాభై, రూపాయలనోట్లు కనిపించినై. ఆమె వాటిని తెల్లారి అవధానులగారికిచ్చి ''ఇదిగో బాబాయి పైకం. మిగతా పని కూడా తెల్లార్చండి. ఎట్లాగోట్లా'' అన్నది. అవధానులుగారు ఉదారుడు, అభిమాని, ఆయన పైకం లెక్క పెట్టి తీసుకుని, పాతిక రూపాయలు తిరిగి ఇచ్చేసి, ''అమ్మాయీ! లోకజ్ఞానం లేనిదానివి. ఏదో కర్మంటూ చెయ్యాలిగాని, దానికి యాభయిలూ, వందలూ ఖర్చుపెట్టక్కర్లేదు. మీరెట్లా బతుకుతారో కదా!'' అని నిట్టూర్చి మిగతా ఏర్పాట్లు చేయడానికి వెళ్ళిపోయినాడు.

3

ఇది జరిగిన రెణ్ణెల్లకి, కరణంగారి పొలాలు చేసే రైతు వచ్చాడు. అనసూయనీ, ప్రసాదరావునీ చూసి అతను కళ్ళ నీళ్ళు పెట్టుకుని '' ఏదో జరిగిపోయింది, వెళ్ళిపోయాడు. మహరాజు పాపం! పసికందులు మీరెట్లా బతుకుతారో! పెళ్ళి, పేరంటం కావల్సినవారు, అబ్బాయి చదువుకోవాల్సినవాడు. ఏమిటో నాకు కుడిభుజం పోయినట్లున్నది'' అని అంగలార్చి, ఈ సంవత్సరం పొలం తాలూకు శిస్తుపోను పైకం తెచ్చాను, నూట ఎనభయి రూపాయలొచ్చినై.'' అని పైకం బొడ్లొంచి తీసియిచ్చాడు. అనసూయ పైకం అందుకుంటూ ''బాబూ! అప్పుడప్పుడు కనబడుతూండు. మాకు ఇంకా చుట్టా లెవరున్నారు నాయనా!'' అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. రైతు సాయంత్రందాకా వుండి అనసూయ బలవంతంచేస్తే అన్నంతిని పోతూ పోతూ జాగర్తలు చెప్పివెళ్లాడు. అనసూయ తెలివితేటలుగలది. తండ్రి వున్నప్పుడే ఇంటిపనులు చేస్తూ, తీరిక సమయాల్లో రామాయణ భారతాలు చదువుతుండేది, బోర్డు ఎలిమెంటరీ స్కూల్లో చదువుకోవడం వల్ల రెండు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకున్నది. ఈ స్వల్ప విజ్ఞానంతోటే ఆమె తమ్ముణ్ణి కూచోపెట్టి పాఠాలు చదవమని, తనకు తెలిసింది వాడికి చెబుతూవుండేది. ప్రసాదరావు కుర్రతనంవల్ల తండ్రిని త్వరలోనే మరచి పోయినాడు. అదివరకే ఐదో తరగతి పూర్తి చేసి వుండటంవల్ల ఫస్టు ఫారం చదవటానికి హైస్కూల్లో చేరాడు.

ఆ యేడు అవధాన్లుగారు, ఆయన భార్య, అనసూయకి చేదోడువాదోడుగా వుంటూ ఆమెకు చుట్టాలు లేని లోపం తీరుస్తూవచ్చారు. చేతిలో సమృద్ధిగా పైకంవుండి, అన్ని హంగామాలు చుట్టంపక్కం వుంటేనే ఆడపిల్లకి వరుడు దొరకడం అంతమాత్రం. ఇవేవీ లేని అనసూయకి పెళ్ళీడు వచ్చిన వరుడు దొరకడం ఎంత కష్టం! ఉండటానికి పెంకుటిల్లు, ఆరెకరాల మాగాణి వున్నది. సాలుసరి తిండికి లోటువుండదు. ఇంట్లో ఒక భాగంలో ఎవర్నో అద్దెకు కుదిర్చారు అవధానిగారు. అదొక ఎనిమిదిరూపాయలొస్తాయి. అయితే కట్నం, కానుక లివ్వందే జాలిదలిచి ఎవరూ అనసూయని పెళ్ళాడేందుకు రారు. ఇవన్నీ అవధానులుగారు ఆలోచించారు; ఆయనకు సంతానము లేక పోవడమే, కరణంగారి సంతానంమీద మమకారం కలిగివుండేట్లు చేసింది అనొచ్చు.

పెళ్ళికేం తొందర! అని వూరుకోటానికి ఆయన మనసొప్పలేదు. పెళ్ళి ఎప్పటికైనా కావల్సిందే, అసలు కరణంగారు బాగుంటే-ఈయేడే పిల్ల పెండ్లి చేయాలని ప్రయత్నం చేసివుండేవారు. ఒక రోజున తనతో ఆ మాటే అన్నారు కూడాను. అనసూయతో ఈ గొడవంతా చెప్పి ఆ అమ్మాయి మనస్సు చెడగొట్టడంకన్న, తనే ఒక సంబంధం కుదిర్చి, ఆ తర్వాత చెబితే, ఆ అమ్మాయైనా తనని కాదనదు. అంతవరకూ అవధానిగారికి గట్టి విశ్వాసంవుంది. అయితే, ఎట్లాగైనా పరాయివాళ్ళు! లోకం తనని ఏదో తప్పుబట్టిదూషించవచ్చు. నిందమోపడం ఎంత తేలిక! కాని ఎంత మంచిపని చేసినా లోకాపవాదం తప్పదని అవధానులుగారు తీర్మానించుకొని, వరాన్వేషణకు పూనుకొన్నారు. తన శక్తి కొద్దీ ప్రయత్నమంతా చేస్తే విఫలమయే పన్లే వుండవు, ఆ ప్రయత్నంలో లోపముండకపోతె. అట్లాగే మరొక రెండు నెలల ప్రయత్నం తరువాత అవధానిగారికి ఒక వరుడు దొరికాడు. ఇతనికి తల్లీ దండ్రీ లేరు. మేనమామ గారి ఇంట్లో వుంటూ ఏదో ఆఫీసులో ఉద్యోగం చేస్తూ వున్నాడు. పాతిక రూపాయలు తెస్తాడు. ఇరవైనాలుగేళ్ళ వయస్సు. ఆస్తంటూ సెంటు భూమిలేదు. జానెడు కొంపా లేదు. జీతంరాళ్ళతో ఈసురోమని మేనమామగారింట్లో కాలం వెళ్ళబోసుకుంటున్నాడు. అసలు తనకి పెళ్ళి అవుతుందా అని నిరుత్సాహపడ్డాడుట. ఈ సంబంధం కుదర్చడంలో అవధానిగారికి రెండు సౌకర్యాలు కనబడ్డయి. మొదటిది కట్నం ఏమీ ఇవ్వనక్కరలేకపోవడం, రెండోది వరుడు ఉన్న వూళ్ళోవాడే కావటం. మరొక్క ఆశకూడా వున్నది అవధానిగారికి, అల్లుడుకూడా కరణంగారింట్లో ఉండిపొయ్యే అవకాశం లేక పోలేదని.

వెండి చెంబులూ, పట్టుబట్టలూ, పెళ్ళి ఖర్చులూ భరించేటట్లయితే, వచ్చే వైశాఖంలోనే శుభముహూర్తము చూడవచ్చు అన్నాడు వరుడి మేనమామ. ఆయన పేరు సత్యనారాయణ. లావుగా, పొట్టిగా వుంటాడు. స్వభావం కూడా రూపానికి తోడుబోయిందే! తనమేనల్లుణ్ణి ఏట్లాగన్నా ఇంట్లోంచి వొదిలించుకోవాలనేది ఆయన ఏకైక ఆశయంగా కనపడ్డది. ఈ మాటలను ఆయన రహస్యంగా దాచుకోలేదు. పైకి అన్నాడు మహారాజు, అవధానిగారు సత్యనారాయణగారు బెట్టినషరతులన్నీ ఒప్పుకొని ''అట్లాగేనండీ! అబద్ధాలాడన్నా ఒక పెళ్ళి చేయమన్నారుగదండీ- అట్లా అబద్ధం ఏమీ అవసరం లేకుండా పుణ్యం కట్టుకుందాం మనం'' అన్నాడు. సత్యనారాయణ ఆమోదసూచకంగా తలూపి ''ఏదో లెండి వాళ్ళిద్దరూ బాగుండటం మనకి కావాలి. కట్నాలూ, కానుకలూ పుచ్చుకోడం బొత్తిగా నా

మతానికి వ్యతిరేకం'' అన్నాడు. తనకొడుక్కి వెయ్యి నూట పదహార్లు చాలవని, సైకిలూ రిస్టువాచీ ఇవ్వాలనీ కాబోయే వియ్యంకుడితో బేరమాడుతున్న పెద్దమనిషి! వాళ్ళ ప్రవృత్తిలోపాలతో తనకేంపని అనుకున్నాడు అవధాని, ''సరే, కానీండి - శుభముహూర్తం పెట్టించమంటారా?'' అని అవధాని ఇంటికి వెళ్తూ అడిగాడు. సత్యనారాయణ ''అలాగే, అలాగే'' అన్నాడు.

పెళ్ళికి సుముహూర్తం వైశాఖంలోనే కుదిరింది. ఇక మూడు నెలల వ్యవధి వుంది. ఈలోగా అవధాని అనసూయకు ఒకనాటి రాత్రి జరిగిందంతా చెప్పి, ''అమ్మాయీ! నీ వుద్దేశం ఏమిటో చెప్పు; నా లోపం లేకుండా తంటాలు పడుతున్నాను, నీకేమయినా ఆక్షపణవుంటే నాతో చేప్పేసెయ్ : కలకాలం కాపురం చేసేది నువ్వు'' అని అన్నాడు, అనసూయ పెళ్ళిమాట ఏత్తేటప్పటికి సిగ్గుపడి ''బాబాయి, కానీండి'' అని వూరుకుంది, నేలకేసి చూస్తూ.

''అట్లా కాదమ్మా! చెప్పు వరుడి వయస్సూ అదీ, ఈడూజోడుగానే ఉంది. ఇంకో విశేషం ఆలోచించు ఆ పిల్లాడుగూడా మన ఇంటికే వచ్చేస్తాడు. ఆ మేనమామ దగ్గిర వుండటంవల్ల నేమో ఊసూరుమని వున్నాడు. ఇక్కడికి వస్తే బాగా ఉంటాడు.''

అనసూయ ఎక్కువగా యేమీ మాట్లాడలేదు. ''మీరు నన్ను వెడగొట్టాలని పెళ్లి చేయటం లేదుగదా. బాబాయి'' అని నవ్వి వూరుకున్నదామె, అవధాన్లు ఆమెలో కనిపించిన ఆమోద భావనని అర్థంచేసుకుని సంతోషించాడు. మరుసటి రోజునుంచే అవధాన్లు పెళ్ళి ప్రయత్నాలలో లీనమైనాడు. ''పెళ్ళి జరగటమూ, ఆరోనెలకే పునస్సంధానము కావడమూ, వెంకట్రావు అవధాన్లుగారి సలహాతో అనసూయ దగ్గిర ఉండిపోవడం జరిగినై, వెంకట్రావు నిమ్మదస్తుడు. అనసూయతో అతను చాలా అన్యోన్యంగా ఉంటూ వచ్చాడు. ఉద్యోగంలో తను సంపాయించేదీ, భార్య తాలూకు సొమ్మూ కలిపి జయప్రదంగా కాపురాన్ని నడుపుకుంటూ వచ్చాడు అతను. అవధాన్లుగారి మనసు కుదుట పడ్డది. మగ దిక్కంటూ యేర్పడ్డ తరువాత సంసారానికి ఇంకేంకావాలీ?

ప్రసాదరావు ఆ యేడు ఫస్టుపారం ప్యాసైనాడు. అనసూయ ఎంతో సంతోషపడ్డది. తమ్ముడు బి.ఏ., చదవాలని ఆమె ఆశపడ్డది. దానికి తగ్గట్టు ప్రాసదరావు చదువే లక్ష్యంగా అల్లరి, ఆగం లేకుండా బడికిపోతూ వచ్చాడు. బావగారు బావమరిదిని ప్రేమతో చూడటమే కాకుండా అతని చదువులోనూ శ్రద్ధ తీసుకొని ఆ ద్వారా భార్యని సంతోష పెడ్తూ వచ్చాడు. సంవత్సరంపాటు ఏ విశేషాలు లేకుండా జరిగిపోయింది. అయితే అది ఎల్లకాలమూ సాఫీగా జరుగుతుందా? అట్లా సాఫీగా జరిగేటట్లయితే జీవితాల్లోంచి కథలెల్లావస్తాయి గనక? అనసూయ భర్తకి ఒక రోజున తలనొప్పి వచ్చింది. మరుసటి రోజు జ్వరం తగిలింది. డాక్టరు దగ్గరికి తమ్ముణ్ణి పంపింది అనసూయ. డాక్టర్ విధిగా చేయాల్సిన చికిత్స అంతా చేశాడు. ఉహూం, డాక్టర్‌కి అలవికాలేదు. ఐదురోజులు నిద్రాహారాలు లేకుండా శుశ్రూష చేసింది అనసూయ, ఇంకో డాక్టరు వచ్చాడు. ఆయనవైద్యం ఇంకో రెండు రోజులు జరిగింది. తర్వాత వెంకట్రావు వైద్యాలూ, భార్య ప్రేమా, రక్షించ లేనిస్థితిలో మృతినొందాడు.

మళ్ళీ ఇరుగుపొరుగు పోయినారు. వెంకట్రావు మేనమామ, ఆయన భార్య విచ్చేశారు. అనసూయని నానామాటలు అన్నారు వాళ్ళు. '' ఈ ముదనష్టపు పెళ్ళి చేయబట్టి నిక్షేపరాయడల్లే వున్నవాడు తెల్లార్చుకు పోయినాడు'' అని సత్యనారాయణ భార్య పెద్దగా యేడ్చింది. అనసూయకు యివన్నీ శూలాలల్లే తగిలినై. తను నూరేళ్ళ కాపురం తగలబడిపోయి ఏడుస్తుంటే ఈ నిందగూడా ఏమిటని ఆమె వాపోయింది. ఆవధానిగారిభార్య అనసూయని కావిలించుకుని ఓదార్చింది. కాని ఓదార్పులతో గాయం మానుతుందా? అయితే ఒకటి - వెంకట్రావు శవాన్ని స్మశానం చేర్చి దహన క్రియలు అయేదాకా వుండి, సత్యనారాయణ, ఆయన భార్యా ఎటువాళ్ళు అటే పోయినారు. మళ్ళీ అవధాన్లుగారూ, అనసూయా, ప్రసాదు మిగిలారు. కాలవలో స్నానం చేసి ముగ్గురూ ఇంటికొచ్చారు. ఇల్లంతా వెలా తెలా పోతున్నది. అనసూయ యేడుపుకు అంతులేదు. ఇట్లాంటప్పుడు అవధాన్లుగారు మళ్ళీ ధైర్యం చెప్పాల్సి వచ్చేటప్పటికి చాలా ఇదయినాడు. ఏం చెబుతాడూ? పదిహేడేళ్ళన్నా నిండని అనసూయకు వైధవ్యం ప్రాప్తించిందంటే ఆయనకే చాలా కోపం వచ్చేసింది, ఆ నీతిమీద. ఆ కోపం విచారంగా మారి ఓదార్పుమాటలుగా వెలువడ్డవి.

''అమ్మా! మనుష్య ప్రయత్నానికి లోటులేకుండా మందిప్పించాం, డబ్బు ఖర్చుపెట్టాం. ఎవరికి ఎన్నాళ్ళు రాసిపెట్టివుందో ఎవరెరుగుదురమ్మా! ఏభైయేళ్ళు వచ్చి నేను బ్రతికి వుండటం యేం? పాతికేళ్ళు నిండని వాడికి నూరేళ్లు నిండడం ఏమిటి? అంతా ఈశ్వర విలాసం కాకపోతే? అమ్మాయి, యేడవకమ్మా! ఏడిస్తే పోయిన వాళ్లు వస్తారు గనకనా'' అని చాలా రాత్రివరకూ కూర్చుని - అవధాని గారూ, ఆయన భార్య అనసూయను అనునయించారు. పదిరోజులవరకూ అనసూయకు మనస్సు మనసులో లేదు. కాని రోజులు గడిచినకొద్దీ జరిగిన వాటిని మర్చిపోవటమే జరగకపోతే మానవజీవితం దుర్భరమౌతుంది. అట్లాగే అనసూయకు అన్నీ నీడలవలె మరుగుపడసాగినై. ఆమె తన జీవితానికిక తమ్ముడే ఆధారమనకోవటంలో అసహజ మేముంది. తన ఆశలన్నిటినీ తమ్ముడిమీదే వుంచి అనసూయ జీవితాన్ని బరువుగా నెట్టసాగింది.

4

నిమ్నోన్నతాల సహజమైన సాంఘిక జీవనం అసహజత్వంలో నలిగి నాశనమై పోతుంది, ఒక్కొక్కప్పుడు. లేదా, ఉజ్వలంగా పైకివచ్చి అన్ని సాంఘిక మర్యాదల్నీ పొందుతుంది. జీవితంలో సుఖభాగ్యాలకు బహిరంగంగా తిలోదకాలిచ్చి అనసూయ సంఘనీతికి బద్ధురాలై నూరేళ్లు నిండిన వయోవృద్ధురాలిగా కనపడసాగింది, కాని ఒక వంక భర్త కలిగించిన నూత్న సుఖావశేషం ఆమెని ఏదో అర్థంకాని ఆందోళనలో పడవేసింది. అయితే ఆ ఆందోళనని వెనక్కి నెట్టి అనసూయ, తమ్ముణ్ణి ప్రాణప్రదంగా చూస్తూ, వాడి చదువుమీద తన దృష్టినంతా కేంద్రీకరించి ప్రసాదరావు ఒక్కొక్క క్లాసే పైకి పోతున్న కొద్దీ ఇంట్లో ఖర్చులు తగ్గించుకుంటూ జీతాలకీ, పుస్తకాలకీ కడుతున్నది అనసూయ.

ప్రసాదరావు రాను రాను షోకిల్లాగా తయారు కాసాగాడు. న్యాయమైన బడిజీతమూ, పుస్తకాల ఖర్చే భరించటం కష్టంగా ఉన్నప్పుడు వాడి సిగరెట్ల ఖర్చూ, సినిమాల ఖర్చూ భరించటం అనసూయకు గడ్డు సమస్య అయింది. అయితే ఈ క్లిష్టపరిస్థితి తమ్ముడికి తెలియవచ్చి నందువల్ల వాడి మనసు చెడి చదువు పాడవుతుందేమోనని అనసూయ తమ్ముడికి ఇవేమీ తెలియనియ్యకుండానే నెట్టుకువస్తున్నది. ఎంతయినా మోయలేని బరువు వేస్తే బండి బోల్తాకొట్టకేం చేస్తుంది? అయితే అనసూయకి ఒక్క పట్టుదల బాగా హెచ్చుసాగింది. ఎన్ని కష్టాలయినా భరించాలి. అసలెందుకు కష్టాలు రావాలి? తను యే సుఖాలకీ నోచుకోలేదు. సరే, తనది ఆడపుటుక, మగపిల్లాడు చదువుకునైనా పైకి రావలిసినవాడు. వాడికి కూడా సుఖం లేకుండా ఇట్లా దరిద్రమేమిటి? దీన్ని ఎట్లా పరిష్కరించడం? ఆమె రాత్రులకి రాత్రులు ఈ ఆలోచనలో నిద్రగూడా పోవటం లేదు. ప్రసాదరావు కనీసం ఈ పరిస్థితిని గుర్తించడానికి గూడా తయారయినట్లు ఏ కోశానా కనిపించలేదు.

వాడిదీ మొండిమతం. 'అక్కా! పావలా యియ్యవే' అనేవాడు. 'సాయంత్రం ఇస్తా, బాబూ!' అనేది అనసూయ. ప్రసాదరావు ఆ పూట భోంచెయ్యనని మొండికేసి పావలా గుంజుకుపోయేవాడు. స్కూల్లో హైరేంకు కుర్రాళ్ళతో తులదూగాలని వాడి కోర్కె. వాళ్ళందరూ ఖద్దరు సిల్కు లాల్చీలూ, ఫుల్ ట్రౌజర్లూ తొడుక్కుని ఇంట్రవల్ టైములో విల్స్ సిగరెట్లు తగలేస్తూ కులాసాగా వుంటూంటే, తనెందుకు అట్లా వుండగూడదు? అని ఆకుర్రాడు తెలియనితనంవల్ల అనుకుని బాధపడసాగాడు. ఈ సంగతులన్నీ సిగరెట్లని మినహాయించి అక్కతో చెప్పుకున్నాడు. వూరకే చెప్పటం కాకుండా నిరశన వ్రతాలు చేయ నారంభించాడు. అనసూయ తమ్ముడికి నయాన చెప్పి చూచింది. వినే ధోరణి లేదు వాడిలో. ఇక ఆమె వేరే మార్గం ఆలోచించాల్సి వచ్చింది. వాడి కోర్కెల్లో తప్పేమీ కన్పించలేదు. సరిగదా, అవి న్యాయంగానే తోచినై. మంచి గుడ్డలు కావాలనటంలో దోషమేమిటి? అని అనసూయ తనలో తను నిర్ధారణకు వచ్చి ''అట్లాగే బాబూ! గుడ్డలు కుట్టిస్తాను'' అని తమ్ముణ్ణి ఆ పూటకి ఓదార్చి బడికి పంపింది.

ప్రసాదరావు వెళ్ళింతర్వాత ఆమె అవధానిగారి దగ్గరకు వెళ్ళి ''బాబాయి! కాస్త పైకం కావాలి. మన రైతుని పిలిపిస్తావూ?'' అన్నది. అవధాన్లుగారు అదే నెలలో రెండు సార్లు పైకం తెప్పించి యిచ్చాడు గనుక ఆశ్చర్యపడి, ''ఇదేమిటమ్మా, యీ సంవత్సర గ్రాసం రెండు నెలల్లోనే ఐపోతే ఎట్లా? పొదుపుగా వాడుకోవాలమ్మా! ముందు సంగతి ఆలోచించకపోతే ఇబ్బంది పడతావమ్మా!: పెద్దో చిన్నో చెబుతున్నాను విను'' అన్నాడాయన. అనసూయ నిజంగానే తడుములాడింది కాసేపు. జరిగిన వాదన గుర్తు తెచ్చుకుని, ''నిజమే బాబాయి. కాని పిల్లవాడికి సరియైన చొక్కా ఒక్కటీ లేదు! ఏం చెయ్యమంటావు? వాడికన్న ఎక్కువా!'' అనగలిగింది. అవధాన్లు ఆ పైన ఏమీ అనలేక పోయినాడు. ఆయనకు తెలుసు అనసూయకు తమ్ముడంటే వుండే ప్రేమ సంగతి. ''సరేనమ్మా పిలుస్తాను!'' అనేసి వూరుకున్నాడు.

అట్లాగే తెల్లారి రామిరెడ్డి తన కొడుకు చేతికి ఏభయి రూపాయలిచ్చి పంపించాడు. అనసూయ

''ఈ పూటకి ఇక్కడే భోంచేసి వెళ్ళు; పొద్దుపోయిందిగా!'' అన్నది. రామిరెడ్డి కొడుకు శేషిరెడ్డి బలిష్ఠంగా, అందంగా వుంటాడు. స్వభావం అతి శాంతమైంది. మంచీ చెడ్డా తెలిసినపల్లెటూరి రైతుబిడ్డ గాబట్టి ''అట్లాగేనమ్మా! మీరు కోప్పడకుండా వుంటే ఒక సంగతి చెబుతాను'' అన్నాడు మెల్లిగా. అనసూయ చిరునవ్వు నవ్వి ''చెప్పునాయనా, నాకు కోపం ఏమిటి?'' అన్నది. శేషిరెడ్డి వసారాలో మంచం వాల్చుకు కూర్చుని ''నాన్నగారున్నప్పుడు పొలం ఎవరికో తాకట్టు పెట్టారట. ఈ సంగతి మొన్న తెలిసింది. తాకట్టు విడిపించుకోకుంటే వచ్చేయేడు పంట రాదు. మా అయ్య మీతో చెప్పమన్నాడు'' అంటూ అనసూయవంక చూశాడు. అనసూయ దెబ్బతిన్న లేడి పిల్లలా అదిరిపోయి ''ఈ కష్టాలు చాలక ఇదొకటా నాయనా! ఎంతకి తాకట్టు పెట్టాడో ఆయన, ఇప్పుడు ఎంతపైకం ఇస్తే విడుదల అవుతుంది. ఇదేం ఖర్మం!'' అన్నది దిగాలు పడిపోయి. శేషిరెడ్డి నెమ్మదిగా ఆమెను ఓదార్చి, ''ఎంతో కాదమ్మా! దిగులు పడకండి. రెండొందల ఏభైయట. ఈ కిత్తా పంటవాళ్ళకిచ్చేశామంటే తాకట్టు విడుదలైపోతుంది'' అన్నాడు. అనసూయప్రాణం ఒక్కసారి దడదడలాడి మళ్లీ కుదుటికి వచ్చింది? '' ఏం ఫరవాలేదంటావు కాని వచ్చే ఏడు అబ్బాయి చదువెట్లా? మీ తిండీ తిప్పలూ ఎట్లా?'' అన్నది. శేషిరెడ్డి సాయంత్రం గుడ్డి వెలుగులో పరీక్షగా చూశాడు. ఆమె అమాయక మయిన వైఖరికి శేషిరెడ్డి హృదయం ద్రవించిపోయింది. పాపం ఆమెకు అన్ని కష్టాలూ ఒక్కసారి వరుసగా వచ్చి పడుతున్నాయి. ''భయపడకండమ్మా, మా అయ్య ఆ పైకం కట్టేస్తాడు. తర్వాతనెమ్మదిమీద మనలో మనం సర్దుకోవచ్చు. అయితే మీరు కొంచెం పొదుపుగా కాలం గడపాలమ్మా రోజులు చాలా గడ్డుగా వున్నాయిసుమండీ'' అన్నాడు శేషిరెడ్డి.

అనసూయకి కృతజ్ఞతావేశంలో కళ్ళనిండా నీళ్ళు నిండినై. ''నాయనా, మీ ఋణం నేను తీర్చుకోలేను. నన్నూ పిల్లాణ్ణి ఒడ్డెక్కించండి, మా అవస్థ భగవంతుడికే ఎరుక'' అన్నది గద్గదంగా. శేషిరెడ్డి మంచంమీదనుంచి లేస్తూ ''మరేం ఫర్వాలేదమ్మా, మనిషి అన్న తరువాత ఆ మాత్రం ఒకరికొకరం సాయం చేసుకోకపోతే ఎట్లా?'' అని, ''అమ్మా, నేను సినిమాకి వెళ్ళివస్తా. పదింటికే వచ్చేస్తాను. తలుపు తీయగలరా?'' అని అడిగాడు. ''దానికేంభాగ్యం నాయనా! నీ సొంత ఇల్లనుకొని రా, తలుపు తీస్తాలే. ఇప్పుడే భోంచేసి పోరాదు? తిరిగి వచ్చే టప్పటికి పొద్దు పోతుందిగా'' అన్నది యదార్థయిన ప్రేమతో. శేషిరెడ్డి మెట్లు దిగుతూ - '' ఇప్పుడు ఆకలిగా లేదమ్మా, మళ్ళీవచ్చి తింటాలెండి'' అంటూ సినిమాకివెళ్ళిపోయినాడు. అనసూయ అతను వెళ్ళినవైపే చూస్తూ వసారాలో కూలబడిపోయింది. జరిగిన సంభాషణంతా వింటున్న అద్దెభాగంలోని అన్నపూర్ణమ్మ వాళ్ళ భాగంలోని వసారలోనే కూర్చుని ''అనసూయమ్మా, ఏమిటి అంటున్నాడతను!'' అని అడిగింది. అనసూయ శూన్యమైన ఇంట్లోకి చూపు పోనిస్తూ '' ఏ ముందండీ, పొలం తాకట్టులో వుందట, విడిపించాలని చెప్పాడు; అట్లాగేనన్నా'' అని ఊరుకున్నది. ఇంతలో బూట్లు టకటక లాడిస్తూ ప్రసాదరావు వచ్చాడు. వొస్తూనే, ''అక్కా, అన్నం పెట్టవే, రెండో ఆటకి పోవాలి అన్నాడు. అనసూయ చప్పున లేచి ''రా నాయనా, అన్నం తిందువుగాని'' అంటూ లోపలికి వెళ్ళింది. ప్రసాదరావు బూట్లువిప్పి గుమ్మందగ్గిర పడేసి లోపలికి వెళ్ళి విస్తరిముందు కూర్చుని వడ్డించిన అన్నం

ముద్దెత్తకుండా ''అక్కాయ్, సినిమాకి డబ్బు లియ్యావే'' అని అడిగాడు. అనసూయ తమ్ముణ్ణి కాస్త విసుగ్గానే చూచింది. కాని వాడు అడిగింది మహావుంటే అర్ధరూపాయి అనుకొని, స్థిమితపడి '' ఇస్తాలే బాబూ, భోంచెయి'' అన్నది ప్రసాదరావు అక్కాయ్యహామీతో భోంచెయ్యనారంభించాడు.

5

ప్రసాదరావు ఆ ఏడు పరీక్ష తప్పాడు. కారణం పరీక్షలప్పుడు జ్వరం తగలడం వల్ల పరీక్షకి వెళ్ళ లేక పోయినాడు. అనసూయ ఏమీ అనలేదు. ఇంకొక రెండు మూడు వందల రూపాయలు ఖర్చు కనబడుతున్నది. అయితే ఈ ఖర్చు ఎట్లాపూడటం? అనసూయ ఆలోచించాల్సిన అవసరం కనపడసాగింది. ప్రసాదరావు ప్రత్యేక ఖర్చులు పెరగడం కన్పించింది కాని ఎందులోనూ తరుగు కన్పించలేదు. అనసూయ మనస్సులో ద్వంద్వయుద్ధం పడ్డది. తనదేమీ గొప్ప సంపాదనకల కాపురం కాదు. నెలకి వందా, వందన్నర సంపాదించే వాళ్ళకే చేతిలో డబ్బు తెమలక ఇబ్బంది పడుతున్నారు. తనదేపాటి; సాలుకి రూ 240. లు వచ్చు సంసారం. ప్రసాదరావు డాబు దర్పాలకు భస్మమై పోతున్నది... అయితే తల్లీ తండ్రీలేని పిల్లాడు వాడికంటేనా?!..... ఇట్లా అనసూయ ఆలోచనతో బరువెక్కిన మనసుకి ఉప శాంతి నివ్వలేకపోయింది. ఈపరిస్థితుల్లో అద్దె భాగంలో యిదివరకున్న వాళ్ళు ఖాళీ చేసి వెళ్ళటమూ, ఎవరో కొత్త వారు రావటమూ జరిగినై.

కొత్తగా వచ్చిన సోమసుందరంగారు వ్యాపారస్తులు, ఆయన ఊరుచివర ఇల్లు కట్టిస్తున్నాడు. అది పూర్తయేవరకు వుంటానని చెప్పి అద్దె పదిహేనివ్వటాని కంగీకరించాడు. ఆయనకి 30 ఏళ్ళుంటాయి. భార్యని పుట్టింటికి పంపించాడు. ఆమె గర్భిణిగా వుండటం చేత, ఒంటరిగా హోటల్లో భోంచేసి వ్యాపారం చేస్తున్నాడు. ఆయన అడపా దడపా దొడ్లోకిస్నానానికి వచ్చినప్పుడు వేరేపనిమీద వచ్చినప్పుడు అనసూయ కనబడి తప్పుకోవడం జరిగింది రెండు రోజులపాటు. ఒకరోజు సాయంత్రం సోమసుందరం కావాలని దొడ్లో మంచం వేసుకుని కూర్చుని చదవడం ఇష్టంలేక పోయినా, ఒక పుస్తకం తిరగేస్తున్నాడు. అనసూయ కేమీ ఘోషానియమాలు లేవు. అనవసరపు సిగ్గూ లేదు. ఆమె తన పనేదో తను చేసుకుంటు రెండో వ్యక్తి ఒకడు దొడ్లో వున్నాడనే సంగతే పట్టించుకోలేదు. సోమసుందరం అనసూయ అందానికి కాస్త చలించాడు. ఆమెని ఎట్లాగన్నా పలకరించాలని తాపత్రయపడుతూ ఆలోచన సాగించాడు. చివరికి '' ఏమండి, కాసిని మంచినీళ్లు ఇవ్వగలరూ?'' అని అడిగాడు. అనసూయ అలాగేనని జవాబిచ్చి, గ్లాసులో మంచినీళ్లు పట్టుకెళ్ళి ఆయనకి ఇచ్చింది. ఈ సంభాషణ కొంచెం విస్తరించటం, సోమసుందరం తన హోటల్ తిండి సంగతి అనసూయకి చెప్పటం, ''పోని నేనువండి పెడతానులెండి'' అని అనసూయ అనటమూ జరిగినై. అయితే సోమసుందరంగారి ఆశయం ఇంతటితో ఆగలేదు. అసలు మగవాడి ఆశయం ఇదా? స్త్రీ అంటూ కనబడితే, మగవాడు తన నిజస్వరూపం చూపక వొదలడు. నాలుగు రోజులు మామూలుగా జరిగిన తర్వాత అనసూయలో

కూడా కాస్త మార్పు కనపడ్డది. భర్తపోయిన నాలుగేళ్ళనుంచీ పరిచయం లేకపోవడంచేతనో లేక మరొక కారణమో తెలీదు. అనసూయ వొళ్ళు గుగుర్పాట్లు పొడవటమూ సోమసుందరంగారి ఆశయము నెరవేరటమూ జరిగినాయి.

అనసూయ ఆ రాత్రి సోమసుందరంగారితో తన ఆర్థికస్థితిని గురించి హృదయం ద్రవించేటట్లు చెప్పుకున్నది. ఆయన ఒక్క క్షణంకూడా ఆలోచించకుండా జేబులోనుంచి నాలుగువందల రూపాయలు తీసి ఇచ్చి, ''నువ్వు డబ్బుకు ఎప్పుడూ ఇబ్బందిపడకు. ఇంకోటిగూడా ఉంది. నిన్ను లోకులు ఆడిపోస్తారని నువ్వు భ్రమపడవచ్చు; అదేమీ జరక్కుండా నేను చేయగలను'' అని హామీ పడ్డాడు. అనసూయ ఒక్క దెబ్బనరెండు విజయాలు సాధించింది గనుక, ''పోదురూ, లోకం నన్నేమన్నా ఉద్ధరించింది గనకనా? ప్రసాదమే కాస్త చదువుకుని సంపాదనపరుడైతే, అందరూ అప్పుడు మూగుతారు'' అన్నది ధైర్యంగా. సోమసుందరం ఆమె ధైర్యానికి మెచ్చుకుని ''అయితే మనకి చిక్కులేదు'' అన్నాడు. ప్రసాదరావు చదువు యస్. యస్. యల్. సి. లో పడ్డది. ఐదవ ఫారం పరీక్ష ప్యాసయిన రోజున ప్రసాదరావు అన్నం దగ్గర - ''అక్కా! ఒక సైకిల్ కొనిపెట్టవే, స్కూలుకి నడవడం యాతనగా వుంది'' అన్నాడు జాలి ముఖం పెట్టి. అనసూయ పులుసు వడ్డిస్తూ ''దానికేంరా, అట్లాగే కొనుక్కుందువుగాని'' అన్నది. ప్రసాదం సంతోషంగా స్కూలుకు వెళ్ళాడు. సోమసుందరంభార్య ఆడపిల్లని కని భర్త దగ్గరకి రావటం వల్ల ఎప్పుడో కాని ఆయనా అనసూయా కలుసుకోవటం సంభవం కావటం లేదు. అయితే సోమసుందరం భార్యతో అనసూయని తెగపొగిడి ఉండటం వల్ల, ఆమెకి ఏ ఇతర అనుమానాలకీ తావు లేకుండా పోయింది. అనసూయకీ, సోమసుందరానికీ వున్న వయోభేధం అన్ని అనుమానాలకీ పరిహారంగా పనిచేసింది. అనసూయ సోమ సుందరాన్ని 'మామయ్యగారూ' అని పిలుస్తుంది. ఆవేళ సోమ సుందరం స్నానం చేస్తున్నప్పుడు, అనసూయ అత్తయ్యగారు అక్కడే వున్నా - లక్ష్యం చెయ్యకుండానే ''మామయ్యగారూ బాబు ఒక సైకిలు కావాలంటున్నాడు; పైకము ఇస్తాను, ఒకటి బేరం చేసి కొనిద్దురూ!'' అన్నది లౌక్యంగా. సోమసుందరం పెద్దమనిషినవ్వినట్టేనవ్వి ''దానికేమమ్మా! రేప్పొద్దున పంపిస్తాను. పైకం ధర కనుక్కున్న తరువాత ఇద్దువుగాని అన్నాడు. అనసూయ ''మరచిపోకండి'' అని చెప్పివెళ్ళి పోయింది.

6

ఈ మధ్య శేషిరెడ్డి పట్నం వచ్చినప్పుడల్లా అనసూయ ఇంట్లోనే మకాం వేస్తున్నాడు. అతనైనా ఏమంత బీదరైతు కాదనే చెప్పాలి. పది పన్నెండెకరాల సొంత వ్యవసాయమూ, ఆ పైన కొంత కవులుకు పుచ్చుకొని వున్నదీ వున్నది. కాస్త పచ్చగా ఉన్న బాపతే. అనసూయ తరహా కాస్త పెద్దమనిషి తరహాయే! ఆమె మొదట్నించీ వున్నా లేకపోయినా హుందాగానే ప్రవర్తిస్తూ వచ్చింది. శేషిరెడ్డికి ఆమె పెట్టినఖర్చు కాస్త ఆశ్చర్యాన్ని కలిగించినా, అనుమానానికి ఆస్కారం ఇవ్వలేదు. అతను మామూలుగానే ఒకరోజు

సినిమా చూసుకని పదిగంటల వేళ వచ్చి తలుపు తట్టాడు. అనసూయ నిద్రమత్తుగా తలుపు తీసింది. శేషిరెడ్డి ''మిమ్మల్ని కష్టపెడుతున్నానండీ!'' అని నొచ్చుకున్నాడు. అనసూయ చిరునవ్వు నవ్వి ''అబ్బే. ఇదేమిటి నాయనా! మీ కష్టం ఎన్నాళ్ళకీ తీర్చుకోలేను'' అని అతనికి భోజనం పెట్టింది, భోంచేస్తున్నంతసేపూ శేషిరెడ్డి కళ్ళు అనసూయమీదే వున్నై. అనసూయకూడా అతనివైపే చూసింది.

శేషిరెడ్డికి ధైర్యం చాలలేదు. బ్రాహ్మణ వితంతువు. హుందాగా బ్రతుకుతున్నది. ఆమె చూస్తోందీ అంటే ఆ చూపు మామూలుచూపే నేమో?! అనుకుని వసారాలో మంచంమీద నడుంవాల్చాడు. అనసూయ వాకిలి లోపల వైపు కూర్చుని ''నాయనా, అంతా కులాసా?'' అని అడిగింది. ఆమె గొంతులోని మృదుత్వం శేషిరెడ్డిని ఒక్కవూపు వూపింది. మంచంమీద వెల్లకిలా పడుకుని ''అంతా బాగానే వున్నారండీ మీ దయవల్ల'' అన్నాడు శేషిరెడ్డి. అనసూయ అతని వైఖరిని పసిగట్టి వుండాలి. ''నాయనా ఓ వంద రూపాయలు ఎల్లుండికల్లా కావాలి. బాబుకి స్కూలు జీతం కట్టాలిసొచ్చింది. డబ్బెట్లా కూడుతుందా అని చస్తున్నాను'' అన్నది మెల్లిగా. ఆమె గొంతు అపూర్వంగాను, మాధుర్యంగాను వినపడ్డది శేషిరెడ్డికి. ''దానికేమండి నేను తెచ్చి పెడతాలెండి. మీరు ఇబ్బంది పడకండి'' అన్నాడు అతను; అనసూయ శేషిరెడ్డిలో మార్పుకి సంతోషిస్తూ ''కాసిని మంచినీళ్ళు కావాలా?'' అంటూ ఇత్తడి చెంబుతో నీళ్ళు తెచ్చి అతని మంచం తలవైపున బెట్టింది. మసక చీకట్లో శేషిరెడ్డి అనసూయ చెయ్యి సరదాగా పట్టుకున్నాడు ఏమయితే అయిందని. అనసూయ అతన్ని నిరాకరించలేదు. శేషిరెడ్డి తెల్లారి తన వూరు పోయి గంటల మీద వందకి వందన్నర పట్టుకువచ్చి అనసూయ కిచ్చాడు. అనసూయ డబ్బు లెక్కపెట్టి తీసుకుంటూ ''చెల్లేసుకుందువుగానిలే నాయనా, సొలుకి ఇంత అని'' అన్నది మర్యాదకి. శేషిరెడ్డి తన హుందాకు లోటు రానివ్వటం, ఆమెకి ఇష్టంలేదు. దాన్నర్థం చేసుకున్న అతనుగూడా ''అలాగేనమ్మా'' అనేసి వెళ్ళి పోయినాడు.

అనసూయ తనువరకు ఖచ్చితంగానే వ్యవహరిస్తూ వచ్చింది. అమెకి తన వయస్సింకా ఇర్వై ఒకటేననే జ్ఞాపకం బాగా వున్నది. తన భవిష్యత్తు గౌరవము లోకుల నోళ్ళల్లోనే ఉందనేది కూడా ఆమెకి బాగా తెలుసు. మరొక్కటికూడా ఆమెని జాగ్రత్తగా వుండటానికి అవకాశమిచ్చింది. తన తమ్ముడి పెళ్ళి - మర్యాదా, తన జీవితానికే ముడిపడి వున్నాయని ఆమెకు స్పష్టంగా తెలుసు. ఏమైనా తను చేస్తున్నది నీతిబాహ్యమైనదని ఆమె భావించినా, దాన్ని రెండు కారణాలచేత మాన లేకపోయింది. శరీరం అన్నతర్వాత కోర్కెలుంటాయి. వాటిని నిరోధించటం మంచిదేకావచ్చు. కాని నిరోధించే బలం ముసలి వాళ్ళకున్నట్లు ఇర్వై ఒక్క సంవత్సరమన్నా నిండని తనకు లేదు. రెండోది - తన ప్రియులు తనని గౌరవంగా చూస్తూ తన ఆర్థిక అవసరాల్ని తీరుస్తున్నారు. అంతడబ్బును తాను న్యాయమార్గంగా సంపాదించడం చాలా వరకు అసంభవం, అసాధ్యమ్మూను. తన దృష్టి మేరలో ఎవరూ కష్టించి కట్టిన మేడలు ఎక్కడా కన్పించలేదు. అనసూయ తనుకితను ధైర్యం చెప్పుకొని మామూలుగా వుంటూవచ్చింది.

అవధాన్లుగారి సలహా, సోమసుందరంగారి అండ, ఇరుగుపొరుగువారి సాయమూ, ఆమెకి యధా ప్రకారంగా లభిస్తూనే వున్నాయి. ఆమె గయ్యాళిదైతే ఆమెని మూడు నిముషాల్లో తప్పు పట్టివుంటుంది

లోకం. కాని అనసూయ గుణం మంచిది. నోరు మంచిది. ఆమెలో జీవ కారుణ్యం కూడా ఆమె ప్రవర్తనలోని లోపానికి ఒక కారణమని చెప్పవచ్చు. ఆమె బయట వున్న మూడు రోజులూ సోమసుందరం గారి భార్యే ఇంత వుడకేసి పడేసేది. సోమసుందరంగారి పిల్ల పుట్టినప్పుడు ఏదో మైల వచ్చి బారసాల ఆగిపోయింది. మళ్ళీ నెలరోజులకి పుట్టిన రోజులనాటికి బారసాల చేసుకునే ప్రయత్నాలు చేశారు. రాజు తలపెడితే డొబుసరికేంతక్కువ? బారసాలకి చుట్టాలు, స్నేహితులూ దాదాపు పాతికమంది వచ్చారు. ఇంట్లో పెత్తనమంతా సోమసుందరంగారు బతిమాలుకొని అనసూయ నెత్తినవేశారు. ఆమె కాసేపు వద్దన్నా చివరికి ఒప్పుకున్నది అవును మరి - రేపు తన యింట్లోనూ శుభా శుభాలు వస్తాయి, తనకు పదిమందితో అవసరం వుంది అనుకున్నది అనసూయ. బారసాల ఇల్లంతా గంధంవాసనతో మల్లెపూలతో ముత్తైదువులతో కళకళలాడింది. అనసూయ జరీవున్న తెల్ల చీరె కట్టుకుని, పెత్తనం చేస్తున్నది లోపల. ఆమె బైటికి రావటానికి వీల్లేదని కాదు - ఆమెకే ఇష్టంలేక రాలేదు నలుగుర్లోకి. ఆమెకి ఆ వేళల్లా తన పెళ్ళినాటి సరదాలు జ్ఞాపకంవచ్చి కాస్త విచారం వేసింది కూడాను. ప్రతి ముత్తయిదువా ఆమె దగ్గరకు వెళ్ళి పలకరించి వచ్చేవాళ్ళు. మగవారు దూరాన వుండి, ఆమె ఎవరో తెలుసుకోవాలని కుతూహలం కనపర్చారు. అనసూయని ద్వేషించే వాళ్ళెవరూ లేరని చెప్పవచ్చు. అందుకు కారణం వెతకటం అనవసరం.

7

ప్రసాదరావు చదువులో ఎంత చురుకో నాజూకు లోనూ అంత ఘటికుడు. వాడు స్కూలుకు వెళ్ళేదారిలో ఒక పూరిల్లు వుంది. అందులో పదిహేనేళ్ళమ్మాయి మంచి అందంగా, కాస్త చలాకీగా అల్లరిగా కనపడ్డది ప్రసాదరావుకి ఒకరోజు. ప్రసాదరావు వస్తుతహా అందంగా నీటుగా వుంటాడు. గనుక ఆ అమ్మాయిని ఆకర్షించగలిగాడు. పది పన్నెండు రోజుల ప్రదక్షిణాలు చెయ్యగా ప్రసాదరావుకి ఆ అమ్మాయి సంగతులు తెలిసినై.

ఆ అమ్మాయి పేరు సీత, ఇంకా పెళ్ళి కాలేదు. వాళ్ళనాన్న బీద ప్లీడరు గుమాస్తా. ఇంటినిండా గంపెడు సంసారం. అందువల్లనే సీత పెండ్లి వాయిదా పడుతూ వచ్చింది. ఇన్ని వివరాల్లోకి వెళ్ళినా ప్రసాదరావుకి ఇంకా మనస్థిమితం కుదరలేదు. ఎందుకంటే ఆ అమ్మాయిని పలకరించి ఏదో ప్రేమ సామ్రాజ్యము నిర్మిద్దామని అతని వూహ. పధ్ధిహేనోరోజున సీత దొడ్డిగుమ్మంలో నిల్చుని ఉండగా ఆ వీధి హెచ్చుతగ్గులలో సైకిల్ పోవటానికి వీల్లేకపోయినా, ప్రసాదరావు శ్రమతో అటే వస్తూ ఆమెని చూచి అకారణంగా సైకిల్ ఆపాడు. సీత గిరుక్కున ఇంట్లోకి పారిపోతుందని అనుకుంటూ మెల్లిగా నడుస్తున్నప్పటికీ, అదేమీ జరక్కపోగా, సీత ప్రసాదరావుని పిలిచింది సైగతో. ప్రసాదరావు సైకిల్ని రోడ్డు మీదే వదిలి చప్పున ఒకసారి చుట్టూచూసి ఆమె దగ్గరికి వచ్చాడు. తరువాత ఒకరినొకరు పరిచయం చేసుకుని మాట్లాడటానికి వీలు ఎప్పుడూ ఉండదు కనుక లేఖలు వ్రాసుకోవచ్చునని

ఒడంబడిక చేసుకుని ఇద్దరూ విడిపోయి నారు ఆరోజుకు. అక్కడనుంచి ప్రసాదరావుకి ఇంకో ఖర్చు ఇదివరకటి ఖర్చులకి తోడైంది. సీత ప్రసాదరావు దగ్గిర రూపాయి, రెండూ తీసుకోవటం మామూలైంది అప్పు డప్పుడూ. ఏంజేస్తుంది దరిద్రగొట్టు సంసారమాయె! కాని సీత ప్రసాదరావు దగ్గర తనను పెళ్ళాడుతానని వాగ్దానం చేయించుకున్న తరువాతనే రూపాయి తీసుకున్నది. ప్రసాదరావుకి పెళ్ళంటే ఏమిటో తెలియకపోలేదు. పద్దెనిమిదేండ్ల వాడికి లోకం సరిగా తెలియకపోయినా అస్పష్టంగా గోతులూ మెట్టలూ ఏవో తెలుసుకోతగినంగా తప్పక తెలిసివుంటుంది. సీతతో పెళ్లి చేసుకుంటాను అని ప్రసాదరావు వాగ్దానం చేసేరోజుని అతనిలో సీత సౌందర్యమే ప్రధానంగా పని చేసింది. అతనూ మనిషే. పైగా చదువుకుంటున్న మనిషి! అతను సీతను ప్రేమిస్తున్న సంగతి సీత తల్లిదండ్రులకు తెలిసి గూడా వూరుకున్నారు. తాము వరుణ్ణి ఎట్లాగూ తేలేకపోబట్టేన్నీ, కూతురైనా మంచి వరుణ్ణే వరించబట్టేన్నీ. ఒక రోజున ప్రసాదం సీతతో చేతులు కలిపి మాట్లాడుతూ, ''సీతా, ఇంక భయమెందుకు? నేను నిన్ను తప్ప ఇంకెవర్నీ పెండ్లి చేసుకోనుగదా?'' అన్నాడు నరాల బాధ కొద్దీ. ''సీత'' చలంగారి పుస్తకాలేమీ చదవలేదు గనుక ఆమెకి మగవాళ్ళు మోసం చేస్తారనే అభిప్రాయం లేదు. తలొంచుకుని ''భయంకాదు. పెళ్ళి చేసుకున్న తరువాతే....'' అని వూరుకొంది సిగ్గుగా. ప్రసాదరావు ఆమె భుజం మీద చెయ్యి వేసి ''ఇటు చూడు సీతా! అవన్నీ పూర్వాచారాలు, వాటిని ప్రేమించుకునే మనం లక్ష్య పెట్టగూడదు. ఎట్లాగూ నువ్వు నా దానివి. ఇక అనుమాన మెందుకు?'' అన్నాడు తను చదివిన ఆధునిక నవలల్లోవీ, చూసిన సినిమాల్లోవీ, భావాల్ని క్రోడీకరించి. సీత ఆవేళటికి ఒప్పుకోలేదు. పది రోజుల వరకూ ఆమె ఈ సంభాషణవస్తే, ఇంట్లో పనివున్నదని వెళ్ళిపోయేది. ప్రసాదరావు మాత్రం మగవాడు కాదూ? స్త్రీ కున్న ఓర్పు అతనికి ఎలా ఉంటుంది? ఒకరోజు పొద్దు కూకిం తర్వాత సీతని కలుసుకుని ప్రసాదరావు ఆమె ఎట్లాగూ అరవదన్న ధైర్యం కొద్దీ ఆమెను కావలించుకున్నాడు. సీత కూడా చేసేది ఏమీ లేక అదివరకే ప్రసాదరావు చేసిన వాగ్దానాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ''ప్రసాదం, నన్ను తప్పక పెళ్ళి చేసుకుంటావు కదూ?'' అని అడిగి ప్రసాదరావు కౌగిట్లో ఉండిపోయింది. ఇది జరిగిన రెండు నెలలకే ప్రసాదరావు పై చదువులకని మెడ్రాస్ వెళ్ళాలి సొచ్చింది. సీతతో చెప్పాడు. సీత గోల పెట్టింది. ''నెల వ్యవధి ఎట్లాగూ ఉందిగనక పెళ్ళిచేసుకునే ఎందుకు పోకూడదు?'' అని ఆమె ప్రసాదాన్ని నిలదీసింది. ప్రసాదరావు ఆమెకి కాస్త ఉపశమనం మాటలు చెప్పి మదరాసు వెళ్ళిపోయినాడు.

8

ప్రసాదరావు మద్రాసు వెళ్ళిం తరువాత అనసూయకి వాడి పెళ్ళి దిగులు పట్టుకు వేధించసాగింది. కుర్రాడు - మద్రాసులో ఏ లేడీన్నా మరిగితే కష్టంగదా అని ఆమె లోలోపల బాధపడి అవధాన్లుగారితో చెప్పుకున్నది. అవధాన్లుగారు వధువుకోసం తిరిగే సత్తాలేక ''అమ్మాయీ మన సోమసుందరంగారితో గూడా చెప్పు. నాస్థితి చూస్తున్నావుకదా? వయస్సు మళ్ళుతున్న కొద్దీ ఎందుకూ పనికిరాకుండా

పోతున్నాను'' అన్నాడు కాస్త దిగులుగానే. అనసూయ గూడా ఆయన్ని అర్థం చేసుకుని ''అవునులే బాబాయి. నువ్వేం తిర్గగలవులే! సోమసుందరం గారితోనే చెబుతాను'' అని, అయితే బాబాయి, మిగతా వ్యవహారమంతా నువ్వే నడపాలిసుమా!'' అన్నది. అవధాన్లు గారు కాస్త అత్మోన్నత్యంతో నవ్వి ''దానికి నువ్వు చెప్పాలా అమ్మా! మన ఇంట్లో పెండ్లికి ఒకరు పిలవాలి గనుకనా!'' అన్నాడు. అనసూయ అవధాన్లుగారి సలహా ప్రకారం సోమసుందరంగారితో చెప్పింది. సోమసుందరం గారు మేడకట్టే పనిలో తీవ్రంగా నిమగ్నులై ఉన్నప్పటికి ''దానికేమండీ! మా బంధువుల్లోనే చాలా మంది పిల్లలున్నారు; కనుక్కొని చెబుతాను'' అని హామీపడి వెంటనే కార్యక్రమంలోకి దిగాడు. అనసూయకు బరువు తీరినట్టనిపించింది.

నాలుగు నెలలు జరిగింతర్వాత గాని వధువు దొరకలేదు. సోమసుందరంగారు మంచి పట్టుదలతో పనిచేసి, చివరకు తన బంధుకోటిలోనే ఒకపిల్లను వెతికి పట్టుకున్నాడు. వధువు కుదరటం వియ్యంకుల వివరాలు అన్నీ అనసూయ ప్రసాదరావుకి వ్రాసింది. ప్రసాదం ఉత్తరం చూచి సంతోషించాడు. కారణాలకేం? కాబోయ్యే మామ మంచి ఆస్తిపరుడూ, పలుకుబడి కలవాడు. పిల్ల కూడా కంటికి బాగానే ఉందని అనసూయ రాసింది కనుక తనరొట్టె నేతిలో పడ్డదని ప్రసాదరావు భావించటంలో తప్పేమిటి? ఐతే ప్రసాదరావు సీతమ్మాటే మరచిపోయినాడనటానికి వీల్లేదు. మదరాసు వచ్చిన కొత్తలో పట్నంయొక్క అందంచందాల్లో లీనమై కొన్నాళ్లు చదువునే మరచిపోయాడు తరువాత ఒక్కొక్కటే జ్ఞాపకం తెచ్చుకున్నాడు. అట్లాగే సీత విషయం కూడా జ్ఞప్తికి వచ్చింది. దీనికితోడు సీతదగ్గర ప్రసాదరావు అడ్రసు ఉండబట్టి ఆమె చాలా ఉత్తరాలు కూడా రాసింది, ఆ ఉత్తరాల్లో మొదటిదాన్ని మాత్రమే సొంతం చదివాడు ప్రసాదం. మామూలు కుటుంబంలో పుట్టి సంస్కారం, చదువుకూడా తక్కువైన సీత వ్రాసిన ఉత్తరాల్లో ప్రసాదరావు చదువుకుంటున్న అందులో షెల్లీ, కిట్సు, బైరన్‌వంటి ఆంగ్లకవుల ప్రణయలేఖలు చదువుతున్న యువకుడికి కవిత్వం కనిపిస్తుందా? రక్తం ఉంటుందా? అయితే సీత ఉత్తరాల్లో ఒక్క విషయం ప్రసాదాన్ని కలవర పెట్టింది. ఆ అమాయక బాలికను తను అనుభవించి కలిగించి వచ్చిన గర్భం నిరంతరం పెరుగుతున్నది. ఎట్లాగయినా తనని పెళ్ళిచేసుకుని ఒడ్డెక్కించమని ఆమె ప్రతి ఉత్తరం లోనూ బ్రతిమాలుతూ వ్రాసింది. ప్రసాదం ఈ విషయాన్ని తోటి స్టూడెంటు గోవిందరావుకి చెప్పి పరిష్కారం సూచించమని అడిగాడు. అతని కేం తెలుసు సీతబాధ? అసలు పురుషుడికీ స్త్రీ బాధలుగాని, బాధ్యతలుగాని తెలుస్తాయి గనుకనా? గోవిందరావు ''పోనియ్యవోయ్, డామిట్... ఇల్లాంటి వాటిని లెక్కచేయటమేమిటి మనం?.....'' అనేశాడు. ప్రసాదరావు ఆ తర్వాత ఆ సంభాషణే తేలేదు. తెచ్చే అవసరంగూడా కలగలేదు.

పెళ్ళి ఉత్తరం వచ్చినరోజుని అకస్మాత్తుగా సీత జ్ఞాపకం వచ్చి, ప్రసాదం ఒకరవ్వ ఆలోచించి మళ్ళీ మామూలు ధోరణికే వచ్చేశాడు. అక్కయ్యకి తన సమ్మతిని తెలియ జేస్తూ ఉత్తరం వ్రాసి పోష్టులో పడేసి స్నేహితులకి కులాసాగా టీ పార్టీ చేశాడు ఆ సాయంత్రం.

9

మామూలుగా అప్పుడప్పుడు సమావేశమయ్యే లోకం ఆ వేళగూడా సోమసుందరం గారి అధ్యక్షతన ('లా' ప్రకారం గాదు) దీక్షితులుగారింట్లో సమావేశమయింది. ఈ సమావేశాన్నే 'సంఘం' అనొచ్చు; లేదా 'లోకం' అనొచ్చు; ఈ సమావేశానికి అందరు సభ్యులు హాజరుకానక్కరలేదు; అవరుగూడాను. దీక్షితులు, అవధానులు, సోమసుందరంగారు తీరికగా కూర్చుని వూళ్ళోవాళ్ల ప్రవర్తనలమీదా, రాబడి ఖర్చులమీదా తర్కాలూ, చర్చలూ సాగిస్తుంటారు తమలపాకులు నములుతూ, దీక్షితులు నెలలతరబడి అడగాలని లోలోపల ఆలోచిస్తున్న ప్రశ్నని బైటపెట్టాడు. ''ఏమండీ సుందరంగారూ, కరణంగారి దేపాటి ఆస్తి ఏమిటి? చాలా విరివిగా ఖర్చు పెడుతుందా అమ్మాయి'' అని అడిగాడు.

''నేను అదే అడగాలనుకుంటున్నానోయ్'' అన్నాడు కళ్యాణసుందరంగారు.

''ఆస్తికేం, నిక్షేపంలాంటి మాగాణి, ఆరెకరాలు ఉంది. ఇంటిలో భాగానికి నేను ముప్పైరూపాయలు ముట్ట చెబుతున్నానాయె, దర్జాకేం లోటూ!'' అన్నాడు సోమ సుందరంగారు.

''ఆరెకరాలటయ్యా?'' అని ఆశ్చర్యం వెళ్ళబోశాడు దీక్షితులు.

అప్పటిదాకా వూరుకున్న అవధాన్లుగారు '' ఏం అట్లా ఆశ్చర్యపడ్డావు? వాళ్ళు ఏమంత ఖర్చుదార్లని? నాకు తెలియకుండా చిల్లి గవ్వ ఖర్చుచేయదు అనసూయ'' అని సమర్థించాడు. ఆయనకు తెలిసినంతవరకు.

''సరే, ఎంత పొదుపుగా కాలం గడుపుతున్నదీ? ఆవిడపిల్లాడి చదువుకని అంత ప్రయాసపడుతున్నది'' అన్నాడు సోమసుందరంగారు.

సంఘం తరుపున సమావేశమైన సభ్యులు సంతృప్తితో సమావేశాన్ని పూర్తిచేశారు. ఆవేళ రాత్రి అనసూయతో మాట్లాడుతూ ''నిన్ను ఏ మాత్రమూ ఆక్షేపించడానికి వీలు లేకుండా చేశాను. అయినా నీ తెలివి తేటలు సామాన్యమా?'' అని తనను తాను మెచ్చుకుని అనసూయనీ మెచ్చుకున్నాడు. అనసూయ కాసేపు వూరుకుని ''అవునండీ మామయ్యగారూ, డబ్బువుంటే మాట్లాడేవాడుకూడా జంకుతాడు సుమా'' అన్నది విజయగర్వంతో.

''బాగా అన్నావు!'' అని సోమసుందరం ఆమెని ఒక క్షణం ఆనందంగా చూచి ''అయితే అనసూయా మా మేడ ప్రక్కన ఒక ఆరుంబాతిక డాబా అమ్మకానికి వచ్చింది. నీ పేరకొనమంటావా? ఒక చోట కలసిపడివుంటాం'' అని అడిగాడు.

''కొనద్దంటానా? తమ్ముడికి పెళ్ళయి పిల్లా జల్లా ఏర్పడితే ఈ కొంప వాడికే సరిపోతుంది. అసలు ఇదంతా వాడిది! నాకు మాత్రం ఓ జానెడు కొంప ఉండొద్దు?''

అన్నది దూరాలోచనతో.

''అయితే కొనేస్తాను'' అని సోమసుందరం సంభాషణ విరమించాడు.

10

ప్రసాదరావు పెళ్ళికి అన్ని ఏర్పాట్లు జరిగినై. కన్యాదాత కట్నం వెయ్యిన్నూట పదహార్లూ, మిగతా లాంఛనాలూ ఇవ్వటానికి ఒప్పుకోటమే కాకుండా అల్లుడికి రూ. 150 ల రిస్టువాచీ కొనిపెట్టడానికి అంగీకరించాడు. పైగా ఒక బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. ఇదంతా సోమసుందరంగారి పలుకుబడివల్ల కలిగిందే. ప్రసాదరావు బి. ఎ. పూర్తి చేసి కాని, ఉద్యోగం చెయ్యననటంవల్ల ఆ యేర్పాటు తాత్కాలికంగా వాయిదా పడ్డది. పెళ్ళి పదిరోజులుండగా ప్రసాదరావు మదరాసునుండి వచ్చాడు. అనసూయ చేయవలసిన అట్టహాసమంతా చేస్తున్నది. స్నాతకానికి ముందు సత్యనారాయణ వ్రతం చేసి పరిచయులందర్నీ భోజనానికి పిలిచింది. అందరు పెద్దలూ వచ్చారు. భోజనాలయ్యాక అందరూ ప్రసాదరావుని ఆశీర్వదించారు. అవధాన్లుగారికి కరణంగారు జ్ఞాపకం వచ్చి కాస్త ఇదయినాడు. అనసూయకూడా చాటుగా కళ్లు తుడుచుకున్నది. ఈ సందట్లోనే ఎవరో ఒకమ్మ మెల్లిగా తనప్రక్కన ఉన్న ఇంకొక ముత్తయిదువతో ''ఏమే విన్నావుటే?: అ కామేశ్వరమ్మకూతురు సీత లేదూ?...'' అన్నది. వినే ఆమె ''ఆ అవును ప్లీడరు గుమాస్తా చేస్తాడుగదూ శేషయ్యగారు...'' అని కుతూహలంగా అన్నది. ఆ ఆయన కూతురే... నిన్న రాత్రి బావిలో పడిందట!'' అన్నది మొదటి ముత్తయిదువ. రెండో ఆవిడ ముక్కు మీద వేలేసుకుని ' ఎందుకు? అని అడిగింది. ఏమోనమ్మా ఎవరికి తెలుసునమ్మా? కాలుజారి పడిపోయిందనుకుంటున్నారు'' అన్నది, మొదటావిడ, ఈ విషయం అట్లా పాకి, పాకి ప్రసాదరావు చెవినపడ్డది. రెండు నిముషాలపాటు ఈతను మౌనంగా ఉండిపోయినాడు. బహుశా సీత ఆత్మశాంతికి ప్రార్థన చేశాడేమో! ఇంకెవ్వరికీ ఈ సంగతి తెలియనందువల్ల ఏ గల్లంతూ కాలేదు.

పెళ్ళి, కన్యాదాత ఇంట్లో జరిగింది - ఐదురోజులూ చక్కగా, దర్జాగా చేశారు ఉన్న వాళ్ళు గనుక. ప్రసాదరావుకి పెళ్ళిపీటలమీద ఉన్నంతసేపూ, సీతరూపం తనముందు నిలుచున్నట్టే వుంది. అతను దయ్యాలు, భూతాలూ వున్నాయంటే నమ్మేవాడు కాదు. అయినా లోపల లోపల పీడిస్తూన్న తన అధర్మమట్లా కనిపిస్తున్నదని గుండె రాయిచేసుకొని మామూలుగా ఉండిపోయినాడు. ప్రసాదరావు తన పాపానికి మరే శిక్ష లేదని తెలిసిన వ్యక్తి ఏం చేస్తాడు? పెద్దమనిషిగా వూరుకున్నాడు. కత్తీ కఠారు పుచ్చుకుని బహిరంగంగానో, దొంగతనంగానో, మనిషిని చంపి ముద్దాయి అయితేతప్ప, ఎవర్నీ శిక్షించలేని సంఘనీతికి; సీత ఎందుకు చచ్చిందో విచారించే వ్యవధి ఎట్లా వుంటుంది? ఒకవేళ ప్రసాదరావే ఆమె మరణానికి కారణమని ఈ నిర్జీవ సంఘానికి తెలిసినా ''ఆడది తొందర పడితే ఈడొచ్చిన మగవాడేమి చేస్తాడేమిటి?'' అంటుంది కాని, ప్రసాదరావు మీద వేలు కదపగలదా? అందుకనే ప్రసాదరావు

మామూలుగా ఉండిపోయినాడు. అతనూ ఆ సంఘంలోని సభ్యుడై పతితుల్ని శాసించే హక్కులు సంపాదించాడు. ఎవరెట్లా నడవాల్సిందీ నిర్ణయించే హక్కుదారుడైనాడు.

ఎవరు దాచినా, ఏ విషయమయినా, ఎన్నాళ్ళో దాగదు. అనసూయకు ప్రసాదము చేసిన ఘనకార్యమూ, అందువల్ల జరిగిన ఆత్మహత్యా పెళ్ళి అయిపోయి ప్రసాదరావు మద్రాసు వెళ్ళిన తరువాత తెలిసింది. ఆమె లోలోపల చాలా బాధపడ్డది. ఆమెకు చాల కోపం కూడా వచ్చింది ప్రసాదరావు మీద. ''ఓరి వీడినోరుపడా! నోరూ వాయీలేని అమాయకపు పిల్లని మోసం చేశాడే!'' అని ఆమె నొచ్చుకున్నది. అయితే వ్యవహారం ఏదోరకంగా ఒక ఆత్మ బలి అయిం తర్వాత పరిష్కారమై పోయింది గనుక ఆమె మెదలకుండా వూరుకున్నది. సీత విషయం ఇంతకన్నా ఏ మాత్రం పొక్కలేదు. దానికి కారణం ఆ దౌర్భాగ్యుడయిన ప్లీడరు గుమస్తా వూళ్ళోనుంచి లేచి పోవటమే. ఇదీ కొంత మంచిదే అనుకున్నది అనసూయ.

11

పెళ్ళయిన రెండో యేటనే ప్రసాదరావు భార్య రాజ్యం కాపరానికి వచ్చింది. ఇంకో ఏడాదిపాటు చదువు ఉండటం వల్ల భార్యా భర్తలు మద్రాసులోనే ఓయిల్లు తీసుకుని కాపరం పెట్టారు. కాపురము ఇటు మామగారి డబ్బుతోనూ, అక్కయ్యపంపే డబ్బుతోనూ కళకళ్ళాడుతోంది. రాజ్యం చదువుకున్న పిల్ల. అందంలోనూ తీసిపోయింది కాదు. భర్తను సంపూర్ణంగా ఆకర్షించిందామె. ప్రసాదరావుకి భార్య మీద అపారమైన అనురాగం వృద్ధి అయింది. అనసూయ గూడా ఒక నెలరోజులు వాళ్ళతో పాటు మద్రాసులో వుండి ఇల్లూ వాకిలీ సరిదిద్ది మద్రాసు నీళ్ళు సరిపడక తనవూరు వచ్చేసింది. ఆమె వూరికిపోయిం తరువాత రాజ్యం తన లోపల కుములుతున్న విషయాల్ని భర్త దగ్గర ఒక్కొక్కటే బయట పెట్ట నారంభించింది. ఒకనాడు రాత్రి ప్రసాదరావు కులాసాగా వెన్నెట్లో పడుకొని సిగరెట్టు కాలుస్తున్నపుడు రాజ్యం పక్కనే కూర్చుని '' ఏమండీ ఈ సంగతి విన్నారండీ?'' అన్నది. ప్రసాదరావు ''ఏసంగతి?'' అన్నాడు నెమ్మదిగా.

నెమ్మదిగా అడగండి. ఏ సంగతీ పట్టదు మీకు ''అన్నది రాజ్యం విసురుగా తన తరవాయి ఉపన్యాసానికి'' పునాదిని గట్టిపరుస్తూ.

''చెప్పరాదుటే నన్ను చంపకపోతేనూ'' అన్నాడు ప్రసాదరావు నెమ్మదిగానే.

''మీ అక్కయ్యగారు తనపేర రెండెకరాలు కొనుక్కున్నదట' అన్నది రాజ్యం ఆశ్చర్యం కలగ జెయ్యాలన్న స్వరంతో.

ఏం కొనుక్కుంటే? అది నోరు కట్టుకొని దమ్మిడీలు మిగిల్చి కొనుక్కుంటూంది మధ్య మన కెందుకంట? నువ్వేమో రాజ్యాలుపోగొట్టుకున్న దానిలా అయిపోతున్నావు'' అన్నాడు ప్రసాదరావు మందలింపుగా.

''రాజ్యాలు పోగొట్టుకోవాలా ఏమిటి? మన బతుక్కి తోడు. పరువుపోతే చాలదూ?'' అన్నది రాజ్యం మూతివిరిచి.

ఈ మాట వినేప్పటికి ప్రసాదరావు గుండె ఆగింది ఒక నిముషం. అతను అదివరకే వూళ్ళో వినివున్న గాలి వార్తలవల్ల అనసూయ ప్రవర్తనమీద కాస్త అనుమానంగా ఉన్నాడు. ఆ సంగతే చెబుతున్నదా ఏమిటి? ''గూఢంగా మాట్లాడుతున్నావేమో? సరిగ్గా చెప్పిచావరాదూ?'' అని విసుక్కున్నాడు.

''నేనడిగితే అట్లాగే విసుక్కుంటారు లెండి. మీ అక్కయ్యకి ఆ డాబా, అ పొలాలు, చేతి గాజులు, మెళ్ళో గొలుసూ ఎట్లా వచ్చినాయండీ? ఇంత డబ్బెక్కడిదంట?'' అని ఆశ్చర్యంతోనూ, ద్వేషంతోనూ, భర్తని తన వైపుకి మరల్చుకునే బుజ్జగింపు స్వరంతో నిలదీసింది రాజ్యం. నిజంగానే ప్రసాదరావు ఐదు నిమిషాలు ఏమీ మాట్లాడలేక పోయినాడు. తరవాత తమాయించుకుని

''ఇంతకీ నువ్వేమంటావో చెప్పుదూ!'' అన్నాడు లౌక్యంగా. తన యెదుటే అనసూయని తప్పులుపట్టే ధైర్యం భార్యకి వుండదనుకున్నాడు ప్రసాదం. కాని రాజ్యం తెలివిగలది. విషయాలన్నీ కుండ పగలగొట్టినట్టు అనకుండా డొంకతిరుగుడుగా బయట పెట్టింది. ''ఆ సోమ సుందరంగారి మేడపక్కనే ఇల్లు కొనడం దేనికండీ? ఇంకెక్కడా ఇల్లు దొరక్కనా? మంచీ చెడూ మాట్లాడాలంటే అవధాన్లు గారుండనే ఉన్నారాయె. ఆయన్ని వదిలిపెట్టి సోమసుందరంగార్నే పట్టుకుని వేళ్ళాడ్తుందేం మీ అక్కగారు? నాకు చెడ్డ సిగ్గుగా ఉందండి, ఇదంతా వింటే'' అంటూ రాజ్యం భర్తకేసి చూసింది, తన ఉపదేశం పనిచేస్తోందా, లేదా అన్నట్టు. ప్రసాదారావు ఏమీ మాట్లాడలేక పోయినాడు. అసలు శిల అయిపోయినాడనవచ్చు. అతనికి తన గత జీవితమంతా ఒక్కసారి సినిమాలా జ్ఞప్తిలోకొచ్చింది. ఇన్నేళ్ళబట్టి తన కింద అయిన ఖర్చే పది పన్నెండు వేలుండొచ్చు, ఆపయిన తన పెళ్ళీ, అక్కగారు కొనుక్కున్న డాబా, పొలమూ! ఇంత ఆదాయం తమకున్న ఆరెకరాల ద్వారానే వచ్చిందీ అంటే ఎవరూ నమ్మరు; తన భార్య తనని దెప్పిపొడవడంలో ఆశ్చర్యం ఏమిటి? అయితే ఇంత డబ్బునూ అక్కయ్య ఎట్లా సంపాదించిందీ... తెలుస్తూనే వుంది - రాజ్యం మొహాన అనలేదు కాని - ఆమె ధ్వనిస్తూన్న దేమిటి? - అయితే ఇదంతా నిజమా? అకారణంగా సోమసుందరంగారు తమ ఇంటి భాగంలో ఇంకా అద్దె ఇచ్చుకుంటూ ఉంటానికి కారణం ఏమిటి సొంత మేడ ఉండి గూడా?...

ప్రసాదరావు ఈ ఆలోచనలతో తలతిరిగి, మరుసటి రోజే మద్రాసునుంచి సొంతవూరు బయల్దేరాడు.

12

అకస్మాత్తుగా, ప్రసాదరావు ఒక్కడే పొద్దున బండికి రావడంతో అనసూయ ఆశ్చర్యపడ్డది. ''ఏం బాబూ, రాజ్యంయేదీ? నువ్విట్లా ఉత్తరంముక్కన్నా రాయకుండా బయల్దేరి వచ్చావేం?'' అని ప్రశ్న

మీద ప్రశ్న వేసింది తమ్ముణ్ణి. ప్రసాదరావు ఒక్కదానికన్నా జవాబివ్వకుండా, మౌనంగా దొడ్లోకి పోయి, కాళ్ళు కడుక్కొచ్చి కూర్చున్నాడు. '' ఏరా అట్లా ఉన్నావేం? దానికేమన్నా జబ్బుచేసిందా ఏమిరా, చెప్పరా?'' అని అడిగింది అనసూయ కంగారుగా, తమ్ముడి పక్కనే కూర్చుని. 'అక్కయ్యా' అని మాత్రం అన్నాడు, అనసూయకు తమ్ముడిగొడవేమీ అర్థంకాక, ''ఏం బాబూ! ఏమిటో చెప్పరా? నాకేదో దడగావుంది. నిన్ను చూస్తుంటే!' అన్నది మరీ ఖంగారైపోయి,

ప్రసాదరావు గుండెని కుదురుబాటులోకి తెచ్చుకుని ''కోప్పడకు అనసూయా! నీ కింత డబ్బు యెక్కడిది?'' అని అడిగాడు సీరియస్‌గా.

అనసూయ పిడుగుపడ్డా అంత చలించేది కాదు. అందులోనూ, ఎన్నడూ పేరుపెట్టి పిల్చి ఎరగని తమ్ముడు పేరుపెట్టి పిలవడం, డబ్బెక్కడిదని అడగడం! ఆమె ఒక్క క్షణం తమ్ముణ్ణి తేరిపార చూచి, పరిస్థితి అర్థం చేసుకుని, మరుక్షణమే తన సహజమైన శాంతగుణంలోకి మరలి '' ఇప్పుడా జిజ్ఞాస నీకు అకస్మాత్తుగా ఎందుకు కలిగింది ప్రసాదం?'' అని అడిగింది.

''నీకు ఈ డబ్బంతా ఎక్కడిదో చెప్పుముందు? తరవాత నేను చెబుతాను నా జిజ్ఞాస సంగతి'' అన్నాడు ప్రసాదం ఆమె శాంతమైన వైఖరికి మండిపోయి.

తమ్ముడి కోపానికి అక్క వెరవదల్చుకోలేదు. ఆమెకి భయం పోయి చాలా యేళ్ళయింది. ''నీకు తెలీదూ మనకి పొలాలున్న సంగతీ?'' అన్నది ఇంకా శాంతంగా!

''ఆ పొలాల ఆదాయమే నంటావా ఈడబ్బంతా?'' అని గర్జించాడు ప్రసాదం.

''కాక''

''ఊ ! ఈ పదేళ్ల నుంచీ, నాకింద ఖర్చయిన పది పన్నెండు వేలూ నీవు కొనుక్కున్న డాబా, పొలాలు, అన్నీ పొలాలమీద వచ్చిన ఆదాయమేనని లోకం నమ్మడం లేదు'' అన్నాడు ప్రసాదం, ఇక ముసుగులో గుద్దులాట దేనికని.

''నువ్విప్పుడు లోకం తరుపున వకాల్తా పుచ్చుకుని వచ్చావా. నన్ను జమాఖర్చు లడగటానికి వచ్చావా? ఇన్నాళ్ళబట్టి ఏం చేస్తున్నావు? పోనీ తెలివి వచ్చింతర్వాతే నీకింద వందలు ఖర్చవుతుంటె, అప్పుడల్లా వూరుకుని ఇప్పుడు వచ్చావేం. ప్రసాదం, నీ బాగుకోసమే నేను ఏంచేసినా! అది నీకు గుర్తు ఉండకపోతే నాకేమీ నష్టంలేదు. అయితే నన్ను నువ్వు ఇట్లా నిలవదియ్యటానికి నీకు ఏమీ హక్కు లేదు గూడాను'' అన్నది అనసూయ నిక్కచ్చిగా.

ప్రసాదం మళ్ళీ అరగంటసేపు ఏమీ మాట్లాడలేక పోయినాడు. కాని అతనిలో పనిచేస్తున్న సంఘ మర్యాద వూరుకోనియ్యలేదు. ''నీ మీద నాకేమీ హక్కులేకపోవచ్చును. కాని, నన్ను నువ్వు ఇట్లా అన్యాయమైన డబ్బుతో అభివృద్ధి చెయ్యాలని నిన్ను ఎవరు బలవంతం పెట్టారు? నేను ఏ మొహం పెట్టుకుని నలుగుర్లో తిర్గగలను? నా పరువూ, మర్యాద మంటగలిసిం తర్వాత ఈ బ్రతుకెందుకూ? ఈ డబ్బెందుకూ?'' అన్నాడు ప్రసాదం కోపం, పశ్చాత్తాపం కలిసిన స్వరంతో.

''నా అన్యాయానికి అంతగా పశ్చాత్తాప పడేవాడివి ఒక్కదానికి జవాబు చెప్పు. నేను చేసిందల్లా నా వరకే వుంటుంది. దానివల్ల ఇతరు లెవరూ బాధపడరు. నువ్వయినా నాతో తెగతెంపులు చేసుకున్నావంటే, చెడ్డదాన్ని ఎలాగూ నేను చెడిపోతాను. నన్ను ఆక్షేపించే ధైర్యం ఎవరికీ లేదని ఇదివరకే రుజువయ్యేవుంది. ఆ ధైర్యం ఏ ఒక్కరికి వున్నా నీకు పెళ్ళయ్యేదికాదు. ఆ భయం నాకు లేదు. ఒక వేళ నీకువుంటే, నా దిగులు నువ్వు పడనక్కరలేదు. ఎందుకంటావా? రక్తస్పర్శనైనా, నేను అవినీతిగా ప్రవర్తించాను గనక. కాని... నువ్వు వెనక్కి తిరిగి ఆలోచించు. నీ మూలంగా ఒక నిండు ప్రాణం బావిలో పడి విలవిలా తన్నుకు చచ్చింది. ఒక్క ప్రాణమా? కాదు; తనతో ఒక శిశువునుగూడా తీసికెళ్ళింది. నువ్వేం న్యాయం మండిస్తున్నావని నన్ను ఆక్షేపిస్తున్నావు? ఇప్పుడు పశ్చాత్తాప పడవలసిందెవరో ఆలోచించు. నేను ఎవర్నీ ఆత్మహత్యల పాలు చెయ్యలేదు. ఎవర్నీ మోసం చెయ్యలేదు. లోకం ఎరుగని దశలోవున్న పిల్లని మోసంచేసి, ఆమె ప్రాణం బలవంతంగా తీసినందుకు నీకు శిక్ష ఏమిటి? పైగా పై పంచ బుజాన వేసుకొని, మర్యాదస్తుడిగా, గౌరవ నీయుడిగా తిరిగే నీకు, నేను అమర్యాద చేసినాదాన్నైనాను కదూ?'' అన్నది అనసూయ. కోపంతో వొణికిపోయింది.

ప్రసాదరావు చప్పున లేచి నుంచుని ''నువ్వు పెంచి పెద్దవాణ్ణి చేసినందుకుగాను, నిన్ను ఏమీ అనకుండా ఇక్కణ్ణించి వెళ్ళిపోతున్నాను. ఇక నీ యిష్టం'' ఇన్నీ అనేసి గబగబా ఇంట్లోంచి బైటికివచ్చి మెట్లు దిగి వెళ్ళిపోయినాడు. అనసూయ వాడు వెళ్ళినవైపే చూస్తూ పిచ్చిదానిలా నిలబడిపోయింది. ఆమె కళ్ళనుంచి అప్రయత్నంగా కన్నీళ్ళు ధారగా ప్రవహించినై. రక్తస్పర్శ ఎక్కడికి పోతుంది.

('రక్తస్పర్శ' కథల సంపుటి, 1963)